06092024-MAI-04_Layout 1 9/6/2024 3:06 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

## కాంగ్రెస్ ఫిరాయింపులు

**పార్టీలు** మారే ఎమ్మెల్యేలకు పింఛన్ రద్దు చేస్తూ హిమాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రెస్ సర్కార్ అసాధారణమైన చట్టం తెచ్చింది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద సభ్యత్వం కోల్పోయినవారికే ఇది వర్తిస్తుంది. అయితే ఏదో సదాశయంతో తెచ్చిన చట్టం కాదిది. కేవలం పార్టీని కాపాడుకునేందుకు దీన్ని తెచ్చారని చెప్పవచ్చు. గత ఫిబ్రవరిలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో పార్టీ విప్‌ను ధిక్కరించినందుకు ఆరుగురు ఎమ్మెల్యేలు సభ్యత్వం కోల్పోయారు. అదే నెలలో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఈ ఆరుగురు ఎమ్మెల్యేలు బీజేపీ అభ్యర్థికి ఓటు వేశారు. దీంతో ఫిరాయింపుల భయం పట్టుకున్న కాంగ్రెస్ సర్కార్ పైన తెలిపిన చట్టాన్ని ప్రవేశపెట్టింది. పింఛన్ పోతుందన్న భయంతోనైనా ఫిరాయింపులు ఆగుతాయనేది వారి ఆశ కావచ్చు. అయితే, పార్టీలు మారడంపై కాంగ్రెస్‌లో ఏకరూప విధానమేదీ లేదు. ఫిరాయింపుల చట్టానికి మరింత పదును పెడతామని 'కాంగ్రెస్ పాంచ్ న్యాయ్' పేరిట విడుదల చేసిన మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చింది. పార్టీ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ గోవాలో తమ శాసనసభ్యులతో పార్టీ మారబోమని ప్రమాణం చేయించి టాంటాం వేసుకున్నారు.

తెలంగాణలో ఆ పార్టీ అనుసరిస్తున్న విధానం మరోలా ఉన్నది. 'విపక్ష శాసనసభ్యుల కొనుగోలు'కు వారి ఇండ్ల చుట్టూ కాంగ్రెస్ పెద్దలు చక్కర్లు కొట్టడం తెలిసిందే. కొందరిని చేర్చుకున్నారు కూడా. అయితే, వ్యవహారం స్పీకర్ ముందుకు, ఆ తర్వాత కోర్టుకు వెళ్లింది. అక్కడ ఏం నిర్ణయం జరుగుతుందనేది వేరే విషయం. కానీ, కాంగ్రెస్ పార్టీ నైతికత ఏమిటో ప్రజలకు బట్టబయలై పోయింది. ఫిరాయింపుదార్లను రాళ్లతో కొట్టి చంపాలన్న సీఎం రేవంత్‌రెడ్డి అరకొరగా ఉన్న బలాన్ని పెంచుకునేందుకు ఆ ఫిరాయింపులనే ఆశ్రయించడం కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలకు చక్కని ఉదాహరణగా నిలుస్తుంది. కర్ణాటకలో బీజేపీ తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు కోట్ల రూపాయలు ఆశ చూపుతున్నదని సీఎం సిద్ధరామయ్య గగ్గోలు పెడుతున్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ ఫిరాయింపు ఎత్తుగడలను ప్రతిఘటిస్తున్నట్టుగా ఫోజు పెట్టే కాంగ్రెస్ తెలంగాణ విషయానికి వచ్చేసరికి పూర్తి భిన్నమైన వైఖరిని అవలంబిస్తున్నది.

అడ్డగోలుగా ఫిరాయింపులు ప్రోత్సహించి ఆయారామ్ గయారామ్ సంస్కృతిని పెంచి పోషించిన కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ఫిరాయింపుల నిరోధక చట్టం రావడం, నీరుగారిపోవడం చారిత్రిక వైచిత్రి. 1957-67 మధ్యకాలంలో ఫిరాయింపుల వల్ల అత్యధికంగా లబ్ధి పొందింది కాంగ్రెస్సే. ఆ కాలవ్యవధిలో 98 మంది కాంగ్రెస్‌ను వీడితే, 419 మంది వచ్చిచేరడం గమనార్హం. 1967లో బీహార్‌లో గయాలాల్ అనే శాసనసభ్యుడు ఒకేరోజు మూడు పార్టీలు మారడం ఫిరాయింపుల సంస్కృతికి పరాకాష్ఠగా చెప్తారు. 1967, 1971 సార్వత్రిక ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర చట్టసభలకు ఎన్నికైన ప్రతినిధుల్లో 50 శాతం మంది పార్టీ మారారు. తదనంతర కాలంలో ఫిరాయింపులపై కాంగ్రెస్ వైఖరి మారింది. 1984లో ఇందిర మరణానంతరం ప్రధాని పదవి చేపట్టిన రాజీవ్‌గాంధీ ఆ ఏడాది చివరలో జరిగిన ఎన్నికల్లో 400 పైచిలుకు స్థానాలు సంపాదించి రికార్డు నెలకొల్పారు. అయితే ఆ విజయం ఫిరాయింపుల వల్ల ఎక్కడ వీగిపోతుందోననే భయం వల్లనో లేక ఫిరాయింపుల మీద ప్రజల్లో వ్యక్తమవుతున్న ఏవగింపు వల్లనో గానీ ఆయన 1985లో ఫిరాయింపుల నిరోధక చట్టం తెచ్చారు. కానీ అది ఎన్నడూ చిత్తశుద్ధితో అమలుకు నోచుకోలేదు. ఇప్పుడు అదే కాంగ్రెస్ తన సొంత అవసరాల కోసం చట్టానికి తూట్లు పొడుస్తుండటం పార్టీ రెండు నాల్కల ధోరణిని ఎత్తిచూపుతున్నది. పైగా, రాష్ర్టానికో విధానం అనుసరిస్తూ అవకాశవాద రాజకీయాలు చేయడం మరీ విడ్డూరం.

# ఓపీఎస్ పునరుద్ధరించాల్సిందే!

**గత కొన్నేండ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికవర్గాలు ఎన్పీఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. అటు కేంద్ర, ఇటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఈ ఉద్యమాన్ని ఉధృతం చేసిన నేపథ్యంలో దేశంలోని పలు రాష్ర్టాల్లో కొన్ని రాజకీయ పార్టీలు దీన్ని ఒక అవకాశంగా వాడుకున్నాయి. ఆయా పార్టీలు 'ఎన్పీఎస్‌ను రద్దు చేస్తాం' అని ఎన్నికల మ్యానిఫెస్టోల్లో ప్రకటించి అధికారంలోకి కూడా వచ్చాయి. అయితే, కేంద్ర ప్రభుత్వం కూడా ఎన్పీఎస్‌పై కేంద్ర ఆర్థిక కార్యదర్శి టీవీ సోమనాథన్ నేతృత్వంలో ఓ కమిటీ వేసి, దాని సిఫారసుల మేరకు ఎన్పీఎస్ స్థానంలో యూపీఎస్ (యూనిఫైడ్ పెన్షన్ సిస్టం)ను అమలుచేయాలనే నిర్ణయం తీసుకున్నది.**



జుర్రు నారాయణ యాదవ్
94940 19270




ఎన్పీఎస్ స్థానంలో కేంద్రప్రభుత్వం తీసుకురానున్న యూపీఎస్ 2025, ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నది. 25 ఏండ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న ఉద్యోగులకు వేతనంలో 50 శాతం పింఛన్ గ్యారెంటీగా చెల్లించనున్నది. మిగిలినవారికి వారి సర్వీస్‌ను బట్టి దామాషా పద్ధతిలో పింఛన్ చెల్లించనున్నది. కనీస పింఛన్ రావాలంటే పదేండ్ల సర్వీస్ పూర్తిచేసి ఉండాలి. ఇది రూ.10 వేలు ఉండనున్నది. ఉద్యోగి మరణిస్తే ఫ్యామిలీ పింఛన్ వర్తిస్తుంది. పింఛన్‌దారుడు మరణిస్తే భాగస్వామికి 60 శాతం పింఛన్ లభిస్తుంది. ద్రవ్యోల్బణానికి అనుగుణంగా పింఛన్‌లో మార్పులుంటాయి. నెల వేతనం మొత్తంలో 10వ వంతున లెక్క గట్టి, ఆరు నెలల సర్వీస్ మొత్తాన్ని ఒక యూనిట్‌గా భావిస్తూ, సర్వీస్ మొత్తం పరిగణనలోకి తీసుకొని పదవీ విరమణ చేసిన రోజున గ్రాట్యుటీకి అదనంగా ఏకమొత్తంగా సొమ్మును ఉద్యోగులకు చెల్లిస్తారు. ప్రస్తుత ఉద్యోగుల చందా 10 శాతం కొనసాగిస్తూనే, ప్రభుత్వ వాటా 14.5 శాతం నుంచి 18 శాతానికి పెరుగనున్నది. ఇప్పటికే పదవీ విరమణ చేసిన వారికి కూడా ఈ యూపీఎస్ వర్తిస్తుంది. ఉద్యోగులు యూపీఎస్ కావాలో, ఎన్పీఎస్ కావాలో ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఈ యూపీఎస్ విధానం 23 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరిస్తే మొత్తం 90 లక్షల ఉద్యోగులకు వర్తించనున్నది.

ఎన్పీఎస్‌లో గ్రాట్యుటీ లేదు. యూపీఎస్‌లో గ్రాట్యుటీతో పాటు ఏకమొత్తం అమౌంట్ పొందవచ్చు. ఎన్పీఎస్‌కి ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు అర్హులు. యూపీఎస్‌కు ప్రభుత్వ ఉద్యోగులే అర్హులు. ఓపీఎస్‌లో ద్రవోల్బణానికి అనుగుణంగా పింఛన్ పెరుగుతుంది. యూపీఎస్‌లో కూడా ఆ అవకాశం ఉన్నది. ఎన్పీఎస్‌లో ఆ అవకాశం లేదు. ఓపీఎస్‌లో పీఆర్సీని పరిగణనలోకి తీసుకొని పింఛన్‌లో మార్పులుంటాయి. యూపీఎస్, ఎన్పీఎస్‌లో ఆ అవకాశం లేదు. ఓపీఎస్‌లో అదనపు పింఛన్‌కు అవకాశం ఉన్నది. యూపీఎస్‌లో ఈ విషయంపై స్పష్టత లేదు. ఓపీఎస్‌లో పింఛన్‌దారుని మరణానంతరం భాగస్వామికి పింఛన్ ఉన్నది. యూపీఎస్‌లో పింఛన్‌దారుని మరణానంతరం జీవిత భాగస్వామికి 60 శాతం పింఛన్‌కు అవకాశం ఉన్నది. ఎన్‌పీఎస్‌లో ఆ అవకాశం లేదు. ఓపీఎస్‌లో హెల్త్ కార్డులున్నాయి. యూపీఎస్‌లో స్పష్టత లేదు. ఓపీఎస్‌లో (జీ)పీఎఫ్ 100 శాతం తిరిగి పొందవచ్చు. యూపీఎస్‌లో స్పష్టత రావాలి. కారుణ్య నియామకాలకు, కుటుంబ పింఛన్‌కు అన్నిట్లో అవకాశం ఉన్నది.

మొత్తంగా యూపీఎస్ వల్ల ఉద్యోగులకు తీరని నష్టం వాటిల్లనున్నది. ఓపీఎస్‌కు షేర్ మార్కెట్‌తో సంబంధం లేదు. ఎన్పీఎస్ వలె యూపీఎస్‌లో కూడా ఉద్యోగి, ప్రభుత్వాల వాటా సొమ్మును ప్రభుత్వమే షేర్‌మార్కెట్లో పెట్టి బడా పారిశ్రామిక వేతల ప్రయోజనాల కోసం కాంట్రిబ్యూషన్ విధానం కొనసాగించనున్నది. పింఛన్ లెక్కింపులో చివరి బేసిక్ పేలో 50 శాతం కాకుండా 12 నెలల సగటు వేతనం పరిగణనలోకి తీసుకోవడం వల్ల ఆ మేరకు ఉద్యోగులు పింఛన్ నష్టపోతారు. యూపీఎస్‌లో పీఆర్సీని పరిగణనలోకి తీసుకోకపోవడం వల్ల ఉద్యోగులకు నష్టం వాటిల్లుతుంది. 25 ఏండ్లు పూర్తిచేస్తేనే పూర్తి పింఛన్ వర్తించడం ఈ విధానంలో ప్రధాన సమస్య. ఈ నిబంధన వల్ల పింఛన్ నుంచి కొన్ని వర్గాలను దూరం చేయడమే అవుతుంది. హెల్త్ కార్డులు, అదనపు పింఛన్‌పై స్పష్టత లేకపోవడం, ఉద్యోగి కాంట్రిబ్యూషన్ తిరిగి తీసుకోవడంపై స్పష్టత లేకపోవడం వల్ల ఉద్యోగులకు నష్టం జరగవచ్చు.

> **ఉద్యోగి నుంచి కాంట్రిబ్యూషన్ 10 శాతం కొనసాగించడం ఈ విధానంలో ప్రధాన లోపంగా కనపడుతున్నది. ఉద్యోగులు కోరుకున్నది కాంట్రిబ్యూషన్ లేని పాత పింఛన్. కానీ, కేంద్ర ప్రభుత్వం యూపీఎస్‌లో కూడా కాంట్రిబ్యూషన్ విధానం కొనసాగించడమంటే పింఛన్ బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నమే అవుతుంది. పీఆర్సీ సమయంలో యూపీఎస్‌ను పరిగణనలోకి తీసుకోకపోవడం అంటే భవిష్యత్తులో ఉద్యోగికి పింఛన్ నిరాకరించడమే అవుతుంది.**

సీనియర్ సిటిజన్‌కు అదనపు పింఛన్ ప్రస్తావన లేదంటే వారి సేవలు విస్మరించడమే అవుతుంది. మొత్తంగా రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వపు హక్కును నిరాకరించడమే. అంతేకాదు ఓపీఎస్‌తో పోల్చుకుంటే ఎన్పీఎస్, యూపీఎస్‌లలో అనేక లొసుగులున్నాయి. ఎన్పీఎస్ అని, జీపీఎస్ అని, యూపీఎస్ అని రోజుకో పింఛన్ సిస్టం తీసుకురాకుండా ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికవర్గాలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు తీసుకుంటాయని ఆశిద్దాం.

(వ్యాసకర్త: రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, తెలంగాణ టీచర్స్ యూనియన్)

> **ఓపీఎస్‌తో పోల్చుకుంటే ఎన్పీఎస్, యూపీఎస్‌లలో అనేక లొసుగులున్నాయి. ఎన్పీఎస్ అని, జీపీఎస్ అని, యూపీఎస్ అని రోజుకో పింఛన్ సిస్టం తీసుకురాకుండా ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికవర్గాలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు తీసుకుంటాయని ఆశిద్దాం.**

# పాపం పండితే కాపాడేదెవరు?


*'ఖర్మ ఎవ్వరినీ, ఎన్నటికీ వదిలిపెట్టదు. చేసిన పాపం ఊరికే పోదు. వడ్డీతో సహా కాలమే సమాధానం చెబుతుంది...' అంటూ ఈ మధ్య సోషల్ మీడియాలో ఓ సిద్ధాంతి వచనాలకు సంబంధించిన వీడియో తెగ వైరల్ అవుతున్నది. వాట్సప్ స్టేటస్‌లో నిత్యం ఆ వీడియో కండ్లకు కనిపిస్తూనే ఉన్నది. అది ఎంతకూ ఆగడం లేదు. ఎందుకు ఈ వీడియోను జనాలు వ్యాప్తి చేస్తున్నారు? మనసుకు నచ్చిన వారంతా స్టేటస్ ఎందుకు పెడుతున్నారో? లోతుగా పరిశీలన చేస్తే దానికో అర్థం, పరమార్థం తప్పక కనిపిస్తున్నది.*



జూపల్లి రమేష్

ఆధునిక సమాజంలో మంచి కంటే చెడుకే ఆకర్షింపబడుతున్న వారు ఎక్కువగా కనిపిస్తారు. బుద్ధిగా జీవించడమన్నది అంత సులభంగా అలవాటు కాదు. ఎడా పెడా ఇష్టమొచ్చినట్లుగా తింటూ, తాగుతూ బతుకడం అంటే ఎవ్వరికైనా సులువైన పని. అలాంటి మర్మమే కర్మ సిద్ధాంతం వెనుక దాగి ఉన్నది. తెలంగాణ రాష్ట్రంలో పాలకుల తీరులో, ప్రజల సమూహంలో వివిధ వ్యక్తుల నడవడికలో ఈ తతంగం లోతుగా దాచిపెట్టబడింది. తమ తప్పు బయటి ప్రపంచానికి తెలిస్తే ఎక్కడ దోషులమవుతామేమోనన్న భయంతో తప్పుడు పనులు చేసినోడు ఎన్నటికీ తన తప్పులను సరి చేసుకోకుండా తప్పుల మీద తప్పులు చేస్తూనే కాలం గడుపుతుంటాడు. నిజాన్ని తొక్కిపెట్టి తప్పుకు అధికారాన్ని ఆపాదించి దండిస్తాడు. ఇదీ ఎక్కువకాలం మనుగడలో ఉండదు. ఎందుకంటే నిజం నిప్పు లాంటిది. ముడితే కాలుతుంది, అవసరమైతే దహిస్తుంది. ఏనాటికైనా తప్పుడు పనులు చేసినోడు కాలం ముంగిట దోషిగా నిలబడాల్సిందే. తప్పుడు వ్యక్తుల తప్పుడు పనులు బట్టబయలు కావాల్సిందే. అందుకు ఎవ్వరూ అతీతులు కారు. ప్రస్తుతం చేతిలో ఉన్న దండనాధికారాన్ని, పెత్తనాన్ని ఉపయోగించి నోరు లేని జీవాలకు, కష్టజీవులకు, శ్రమకారులకు ఇబ్బందులు సృష్టించొచ్చు గాక... ఎండ్ ఆఫ్ ది డే నిజం నిలబడి గెలుస్తుంది. గెలిచినప్పుడు తప్పుడు వ్యక్తుల తీరు తేటతెల్లమవుతుంది.


ఈ తప్పుడు సిద్ధాంతం ఇప్పుడే ఎందుకు గుర్తుకువచ్చిందంటే ప్రస్తుతం తెలంగాణలో జరుగుతున్న కొన్ని ఘటనలు అందుకు కారణంగా నిలుస్తున్నాయి. గత ప్రభుత్వాన్ని జనాలు గద్దె దించారు. 2014లో కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో పదేండ్లు ప్రభుత్వాన్ని సగర్వంగా నడిపి, రాష్ర్టాన్ని దేశంలో మేటిగా నిలబెట్టినప్పటికీ ఫలితం మాత్రం వేరే మాదిరిగా వచ్చింది. అదంతా ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పు. దానిని ఎవ్వరైనా శిరసావహించాల్సిందే. అయితే, గతంలో పరిపాలన కోసం తహతహలాడుతూ నోటికొచ్చిన వాగ్దానాలు చేసినవారు, కల్పిత హామీలతో ప్రజలను మభ్యపెట్టినవారు, అసత్య ప్రచారాలతో జనాలను గందరగోళంలో



ముంచినవారంతా ఇప్పుడు అదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈసారి బయటి వ్యక్తుల ప్రమేయం లేకుండానే పాలకులు చిక్కుల్లో చిక్కుకుంటున్నారు. ఉదాహరణకు 2023లో గ్రూప్-2 పరీక్షల రద్దుకై భారీగా పోరాటాలు జరిగాయి. ఆనాడు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేందుకు ప్లాన్ వేసినవారికే అలాంటి ఘటనే చుట్టుముట్టి ఊపిరి తీసుకోకుండా చేసింది. చివరికి యువ పోరుకు తలొగ్గాల్సి వచ్చింది. డిసెంబర్ 7న సీఎంగా వచ్చి రుణాలు మాఫీ చేస్తా... టక్కున వెళ్లి రూ.2 లక్షలు పంట రుణాలు తీసుకోవాలంటూ ఏడాది కింద ప్రగల్భాలు పలికినవారంతా రైతులతో పాటే రుణపాశంలో ఇరుక్కోవాల్సి వచ్చింది. సోషల్ మీడియాను విచ్చలవిడిగా వాడుకొని నోటికొచ్చింది రాసుకొని ప్రచారం చేసి నాటి పాలకులను ఇబ్బందిపెట్టిన వారికి ప్రస్తుతం అదే గతి పట్టుకున్నది. సోషల్ మీడియాలో ప్రస్తుత పాలకులకు ఎదురవుతున్న ముప్పు అంతా ఇంతా కాదు. కేవలం స్వల్ప కాలంలోనే తెలంగాణ సమాజం తిరగబడి ఎదిరిస్తున్నది. ప్రశ్నలను సంధిస్తున్నది. సమాధానాలు చెప్పలేక ప్రశ్నించిన గొంతుకలను పోలీసు కేసులతో పాలకులు నొక్కేస్తున్నరు. వ్యవసాయ క్షేత్రాలకు 'ఫార్మ్‌హౌజ్' అనే ఆంగ్ల పదజాలాన్ని వాడి ఒకరిద్దర్ని ఇబ్బందులకు గురిచేసినవారికి అచ్చంగా ఫార్మ్‌హౌజ్‌ల రూపేణా ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఫార్మ్‌హౌజ్‌లు లేని వారెవరు? అన్న విషయం ఇప్పుడు బయటపడింది. చక్కగా వ్యవసాయం చేసుకునే క్షేత్రానికి, జల్సాలు చేసుకునే ఫార్మ్‌హౌజ్‌లకు లింకులు పెట్టి విషాన్ని చిమ్మిన వారికి అబద్ధమే అడ్డం తిరిగి వారి నిజ స్వరూపాన్ని బట్టబయలు చేస్తుండటం మనమంతా చూస్తున్నాం. ఇలాంటిదే ఇంకో వాస్తవాన్ని మనం గుర్తించాల్సి ఉన్నది.

> **ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ పేరు చెప్తే కొన్ని వర్గాలకు గిట్టదు. కానీ, తెర వెనుక ఒవైసీ విద్యా దానం ఎంతటి గొప్పదో ఎవ్వరికీ తెలియకపోవడమే విచిత్రం. నిజానికి, అబద్ధానికి మధ్య వాస్తవం బతికే ఉంటుంది. 'హైడ్రా' పేరుతో కూల్చివేతల పర్వం కొనసాగుతున్న ఈ సమయంలో ఆ విద్యాసంస్థలు వెలుగుచూడటం విశేషం.**

చెరువు ఆక్రమణ అన్నది పక్కనపెడితే విద్యావ్యాప్తికై జరుగుతున్న సామాజిక సేవను కూకటివేళ్లతో తీసి పారెయ్యలేని నిజమే. దేవుడున్నాడో లేడో దేవుడికే ఎరుక. కాకపోతే కాలమనేది చాలా పవర్‌ఫుల్. మనల్ని నిశితంగా గమనించే కాలచక్రంలో తప్పు చేసినోడు ఎన్నటికీ తప్పించుకుపోలేడు. తప్పొప్పులను గుర్తించి సరిచేసే తెలివితేటలు లేకపోతే వ్యవస్థకు తద్వారా సమాజానికి ఇబ్బంది దాపురిస్తుంది. అల్టిమేట్‌గా సామాన్యులు ఇబ్బంది పడతారు. వినకుండా, చూడకుండానే ప్రతీది నిజమని నమ్మేవారు ఉన్నంత కాలం... వినిపించినా, కనిపించినా అబద్ధాలనే నిజాలుగా నమ్మినవారు ఉంటే కలిగే నష్టం మాటల్లో చెప్పలేనిది. దాని మూల్యం వెలకట్టలేనిది. వ్యవస్థ కుప్పకూలేదాకా బయట పడనిది.




## ఆమె మౌనంగా ఉంటే మంచిది



షేక్ హసీనా భారత్‌లో కూర్చొని వ్యాఖ్యలు చేస్తున్నారు. అక్కడినుంచే ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఆమె అలా చేస్తుండటం బంగ్లాదేశీయులకు నచ్చడం లేదు. ఆమె మాట్లాడకుండా ఉంటే ఇరుదేశాలకూ మంచిది.

**- మహమ్మద్ యూనుస్**
బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత



## 'హైడ్రా'తో లక్ష్యం నెరవేరేనా?

**రెండు నెలలు తిరగకుండానే 18 చోట్ల అక్రమ నిర్మాణాలను తొలగించి 'హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ' (హైడ్రా) సంచలనం సృష్టించింది. అయితే, ఈ హడావుడిలో ప్రజలు వేస్తున్న కొన్ని ప్రశ్నలకు 'హైడ్రా'కు సమాధానాలు దొరకడం లేదు. ఇప్పుడు కూల్చుతున్న ఆక్రమణలకు గతంలో అనుమతులు జారీ చేసింది అధికారులే కదా? కబ్జాకు గురవుతున్నప్పుడు ఈ రెవెన్యూ అధికారులు ఏం చేసినట్టు?**


గత జూలైలో హెచ్ఎండీఏ పరిధిలోని చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ వివరాలు నోటిఫై చేయనందుకు హెచ్ఎండీఏను హైకోర్టు మందలించింది. అయినా, హైడ్రా ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టీఎల్), బఫర్‌జోన్ పరిధిలో ఉన్న భవనాలను, బస్తీలను కూలగొట్టడం మొదలుపెట్టింది. హైకోర్టు పేర్కొన్నట్టు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ వివరాల్లేకుండా 'హైడ్రా' కూలగొట్టడం ఎలా మొదలుపెట్టిందన్నది అంతు చిక్కని ఒక ప్రశ్న. 'ఎవరైనా ప్రభుత్వ భూములు, చెరువులను కబ్జా చేస్తే ఫోన్ చేసి చెప్పండి' అని జూలై నెలాఖరులో హైడ్రా పకటన ఇవ్వడం ఆశ్చర్యం. అసలు ప్రభుత్వ భూములు ఏమేం ఉన్నాయో, ఎక్కడెక్కడ ఉన్నాయో అన్న వివరాలు రెవెన్యూ విభాగం నుంచి హైడ్రా అధికారులు తీసుకున్నారా? ఆ ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు మార్కింగ్ చేశారా? హెచ్ఎండీఏ ఏర్పాటుచేసిన లేక్ ప్రొటెక్షన్ కమిటీ సంగతి ఏమిటి? ఇలా చాలా ప్రశ్నలున్నాయి.

'హైడ్రా' అధికారులు కూల్చబోతున్న భవనం లేదా బస్తీ, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందా లేదా అని సర్వే చేయనక్కర్లేదా, చెరువు దగ్గరకి వెళ్లి, దాని చుట్టుపక్కన ఉన్న ఇండ్లలో ఏది కూల్చాలని నాణెంతో చిత్తు బొత్తు వేసుకుని నిర్మాణాలను తొలగిస్తారా? THE TELANGANA PUBLIC PREMISES (EVICTION OF UNAUTHORISED OCCUPANTS) ACT, 1968 ప్రకారం.. ఆక్రమణదారులకు ముందు షోకాజ్ నోటీసు ఇవ్వాలి. దానికి వారు సమాధానం ఇస్తారు. వారు చూపించిన పత్రాలన్నీ పరిశీలించి, వారి వాదనలు విని, వారు చట్టానికి వ్యతిరేకంగా అక్కడున్నారంటే, అప్పుడు ఎవిక్షన్ ఆర్డర్ జారీచేయాలి. ఈ ఆర్డర్ ఇచ్చిన 30 రోజుల్లోగా కబ్జాదారులు అక్కడినుంచి కదలకపోతే అప్పుడు బలవంతంగా తొలగించేయవచ్చు.

హీరో అక్కినేని నాగార్జునకు చెందిన 'ఎన్' కన్వెన్షన్ హాల్, గండిపేటలోని భవంతులు హైడ్రా కూల్చుతున్నప్పుడు సంపన్నులకు గుణపాఠం జరుగుతున్నదని కొందరు చంకలు గుద్దుకోవచ్చు. కానీ, మరి పేద ప్రజల సంగతేమిటి. ఉపాధి కోసం పల్లెల నుంచి పట్టణానికి వచ్చే పేద ప్రజలకు ప్రభుత్వ భూములే కాస్త ఆసరా. అక్కడ ఓ గుడిసె వేసుకొని, దగ్గరలో ఏదో పని చేసుకుంటుంటారు. వారి ఆదాయానికి అద్దె కట్టడం కూడా కష్టమే. అలా గుడిసె వేసుకోవాలనుకునే వాళ్లకు హైదరాబాద్‌లోని పలు చెరువుల పక్కన ఉన్న భూమి మాత్రమే అనుకూలంగా ఉంటుంది. సరే, వారిని అక్కడినుంచి వెళ్లండని నోటీసులిచ్చి, వారికి ప్రత్యామ్నాయాలు చూపించి అక్కడికి పంపించడం ఒక పద్ధతి. బుల్డోజర్లతో మీద పడిపోవడం మరో పద్ధతి. 'హైడ్రా' విధానాలను కొందరు విమర్శిస్తున్నారంటే , వారంతా చెరువుల పరిరక్షణకు వ్యతిరేకం అని కాదు.

> **గూడు చెదిరిన పక్షుల వలె తలోదిక్కు అవుతున్న పేద బతుకుల సానుభూతిగానే చూడాలి. చెరువులు కబ్జా అవుతుంటే అది చెరువులకే కాదు, నగరానికి, ప్రజలకే నష్టం జరుగుతుందనేది నిజం. అయితే, చెరువుల పరిరక్షణలో భాగంగా ఒకవేళ పేదల గుడిసెలను తొలగించాల్సి వస్తే వారికి ముందస్తు నోటీసులిచ్చి, ఆ సమీపంలోనే వారికి ప్రత్యామ్నాయాలని చూపడం ప్రభుత్వ యంత్రాంగం కనీస చర్యలు అని నొక్కి చెప్పక తప్పదు.**

చెరువులు, నదుల బఫర్‌జోన్‌లను కాపాడటం చాలా ముఖ్య విషయం. అవి ప్రకృతిలో భాగం. అయితే, ప్రస్తుతం ఉన్న భవంతులను కూలగొడితేనే చెరువులను కాపాడినట్టు కాదు. వాటిని కాపాడాలంటే, వాటి బఫర్‌జోన్ మార్కింగ్ సజావుగా జరగాలి. దాని చుట్టూరా ప్రహరీనో, సరిహద్దు రాళ్లో పెట్టాలి. ఇప్పటికే అక్కడ నివసిస్తున్న ప్రజలకు పర్యవసానాలను వివరించాలి. చెరువు భూములు కబ్జాకు గురి కాకుండా రెవెన్యూ చట్టంలోని లోటుపాట్లను సవరించాలి. చట్టాలు అనుసరించకపోతే ప్రజలకు శిక్ష పడుతుంది. మరి, చట్టాలు అనుసరించని ప్రభుత్వ విభాగాల సంగతి ఏమిటి? అందుకే, భూమి రిజిస్ట్రేషన్ అయ్యే విషయం దగ్గరినుంచి, రెవెన్యూ శాఖ ప్రభుత్వ భూముల వివరాలు బయటపెట్టడం దగ్గరి నుంచి మార్పు మొదలవ్వాలి. ఇవన్నీ జరగకుండా 'హైడ్రా' అక్రమ నిర్మాణాలను యథేచ్ఛగా కూలగొడుతూ పోవడం అర్థరహితం.



సంజీవ్
99855 88384
(వ్యాసకర్త: మానవ హక్కుల వేదిక)